

సామాన్యులకు న్యాయ సేవలు

సామాన్య పౌరులకు న్యాయ ఫలాలను అందించాలని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. 8లో



క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రతిభ గల క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తామని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. 8లో

తొలి ప్రయత్నంలోనే..



ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యమని నిరూపించాడు మజ్జి వంశీకృష్ణ. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఆ యువకుడు సమాజ సేవ చేయాలన్న ఆశయంతో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు. 12లో

న్యూస్‌రీల్

నేటి నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థి కొలత తీస్తున్న అధికారులు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ఉద్యోగాల నియామకాల కోసం బుధవారం నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం పురుష అభ్యర్థులకు పరీక్షలు చేశారు. రేంజ్ పోలీస్ అధికారులు 800 మంది అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు పంపగా వారిలో 589 మంది హాజరయ్యారు. వారికి పరుగు, లాంగ్ జంప్, కొలతలు తీసి, సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 2 వరకు మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారి కోసం ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. 2,745 మంది మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు పరీక్షలు జరుపుతామన్నారు. పరీక్షలను డీఐజీతోపాటు అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పర్యవేక్షించారు.

ఈవీఎం గోదాం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ఈవీఎం గోదాంను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం సందర్శించారు. భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, రూరల్ తహసీల్దార్ ఎస్.రమణయ్యతో కలిసి గోదాం లోపల ఈవీఎం బాక్సులు, వీవీ ప్యాడ్ బాక్సులు తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ గోదాంకు కట్టుదిట్టమైన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు. తనిఖీలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉమాగాంధీ అందరికీ ఆదర్శం



ఉమాగాంధీని సత్కరిస్తున్న మేయర్

అల్లిపురం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన డాక్టర్ మురహరరావ ఉమాగాంధీ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయురాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఈ మేరకు ఆమెను నగర మేయర్, జీవీఎంసీ అదనపు కమిషనర్, ఉప విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు మంగళవారం సత్కరించి అభినందించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ శివాజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఉమాగాంధీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడం విశాఖకి గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని, ఇటువంటి ఉపాధ్యాయులు మన పాఠశాలలో పనిచేయడం అదృష్టంగా భావించాలన్నారు.

భాషోద్యమ పితామహుడు గిడుగు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: తెలుగు భాష వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లికార్జున మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, పరిపాలనాధికారి కె.ఈశ్వరరావు, పూర్ణిమాదేవి, సమాచార శాఖ ఆర్‌జేడీ వి.మణిరామ్ పాల్గొన్నారు.



• ఎకో వాక్ @ బీచ్‌రోడ్డు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఎకో వైజాగ్ వాక్‌కు విశేష స్పందన లభించింది. ఆర్‌కే బీచ్ వద్ద కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రారంభించారు. వాక్ అనంతరం వైఎంసీఏ వద్ద ఏర్పాటు చేసిన సభలో పర్యావరణ పరిరక్షణకు సహకరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి, జేసీ విశ్వనాథన్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తం, క్రికెటర్ కె.ఎస్.భరత్, నగర పౌరులు పాల్గొన్నారు. – ఆరిలోవ







ఎకో వైజాగ్ వాక్ ప్రారంభిస్తున్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మేయర్ హరి వెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, పాల్గొన్న నగరవాసులు

తీర శుభ్రతకు మహాయజ్ఞం



తీరంలో యంత్రాల పనితీరు పరిశీలిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తదితరులు

- 6 యంత్రాలు సమకూర్చిన జీవీఎంసీ
- ఆర్కే బీచ్‌లో ట్రయల్ రన్ పరిశీలించిన మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖ సాగర తీరాన్ని శుభ్రపరిచేందుకు జీవీఎంసీ సరికొత్త యంత్రాలను సమకూర్చుకుంది. ఎకో వైజాగ్‌లో భాగంగా రుషికొండ, ఆర్కే బీచ్, భీమిలి తదితర చోట్ల తీర ప్రాంతాన్ని శుభ్రం చేసేందుకు బీచ్ టెక్ 2000 ఎస్ పేరిట ఐదు వాహనాలను రూ.9.98 కోట్లతో మూడేళ్లపాటు లీజుకు తీసుకుంది. మరో వాహనాన్ని 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.82 లక్షలతో జీవీఎంసీ సొంతంగా సమకూర్చుకుంది. బీచ్ క్లీనింగ్ పేరిట ఐదు వాహనాలు నిత్యం తీర ప్రాంతాల్లో తిరుగుతూ వ్యర్థాలను ఏరివేస్తాయని, మరో వాహనం స్టాండ్ బైగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మంగళవారం ఈ వాహనాల పనితీరును ఆర్కేబీచ్‌లో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతానికి ఎంతో మంది పర్యాటకులు, సందర్శకులు వస్తారన్నారు. తీరం వెంబడి ఉన్న ఇసుకపై వారు సేద తీరుతారని, అక్కడ పరిశుభ్రంగా ఉంచేందుకు బీచ్ టెక్ 2000ఎస్ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇసుకలో ఉన్న వ్యర్థాలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏఎంవోహెచ్‌లు డాక్టర్ రాజేష్, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిరిధాన్యాల రక్షాబంధన్

- పర్యావరణహితంగా రాఖీల తయారీ
- ఆదర్శంగా రాయప్పాలెం హైస్కూల్ విద్యార్థులు



సిరిధాన్యాలతో తయారుచేసిన రాఖీలు



పాఠశాల ఆవరణలో మామిడి చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

తగరపువలస: రాఖీ పౌర్ణమి... అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనురాగ బంధానికి ప్రతీక. ఈ పర్వదినాన్ని పర్యావరణహితంగా జరుపుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు జీవీఎంసీ రెండో వార్డు రాయప్పాలెం హైస్కూల్ విద్యార్థులు. హాని కలిగించే రంగులు, పూసలు, రాళ్లు, పాలిథిన్, స్పాంజ్‌లతో తయారు చేసిన రాఖీలు రక్షాబంధన్ రోజున వినియోగించడంతో మరుసటి రోజు నుంచి అవి పర్యావరణానికి హాని కలిగించేలా మారుతున్నాయి. ఈ రాఖీల కోసం అందరూ వందలాది రూపాయలు ఖర్చు చేస్తుంటారు. అలా కాకుండా తక్కువ ఖర్చుతో రాఖీలు తయారు చేయడమే కాకుండా అవి భవిష్యత్ అవసరాలకు వినియోగమయ్యేలా రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించారు. ఇందుకు ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, ఇతర ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు. దళసరి పేపర్, తుమ్మ, మునగచెట్టు నుంచి వచ్చే జిగురు, దారంతో రాఖీలు తయారు చేస్తున్నారు. వీటిపై వారి అభిరుచులకు అనుగుణంగా రాగులు, సజ్జలు, జొన్నలు, ధాన్యం, కొర్రలు, సామలు, ఊదలు, మొక్కజొన్న గింజలను వినియోగిస్తున్నారు. ఇంకా విత్తనాలకు సంబంధించి వంగ, గోంగూర, చిక్కుడు, బీర, కాకర, సపోటా, సీతాఫలం, ఆనప, గుమ్మడి, మెంతులు, దనియాలు అద్దుతున్నారు. ఈ రాఖీలను స్కూల్‌లో తోటి విద్యార్థులు, ఇంట్లో సోదరులకే కాకుండా రిబ్బన్లు, కాగితపు రాఖీలను తయారు చేసి చెట్లకు కట్టనున్నారు. మరుసటి రోజు ఈ విత్తన రాఖీలను జాగ్రత్తగా సేకరించి పాఠశాల ఆవరణలో నాటి మొక్కలు వచ్చే వరకు సంరక్షిస్తారని ఉపాధ్యాయులు తెలిపారు. వీరి ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు.

మొక్క నాటండి... బహుమతి పొందండి

అల్లిపురం: విశాఖ నగరంలో ప్రతి ఇంటా అన్నాచెల్లెల్లు, అక్కా తమ్ముళ్లు ఎంతో ఆనందంగా అనురాగబంధంతో జరుపుకోనున్న రక్షాబంధన్ సంబరాలను పర్యావరణహితంగా జరుపుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ కోరారు. ప్రతి ఇంటా ఎకో రక్షాబంధన్‌ను జరుపుకునేందుకు జీవీఎంసీ పోటీలు నిర్వహిస్తోందన్నారు. రక్షాబంధన్ నాడు తోబుట్టువుల అనుబంధానికి చిరకాల గుర్తుగా ఒక మొక్క నాటాలని, ఒక మొక్కను కానుకగా బహూకరించాలని సూచించారు. నగరంలో రక్షాబంధన్ సందర్భంగా అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్లు ఒక మొక్కను బహూకరిస్తున్నట్లు, ఒక మొక్కను నాటుతున్నట్లు ఫొటో, సెల్ఫీలు తీసుకుని జీవీఎంసీ నిర్వహిస్తున్న ఎకో – వైజాగ్ రక్షాబంధన్ పోటీలకు # Eco Vizag Raksha bandhan హాస్ టాగ్‌ను ఉపయోగించి, జీవీఎంసీ సోషల్ మీడియా అకౌంట్లు Twitter: GVMC& VISAKHA, INSTA: gvmc& visakhapatnam, Facebook: GVMC. VISAKHA లో పోస్టు చేయాలని సూచించారు. ఉత్తమ ఫొటోలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. విశాఖ నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ఎకో – వైజాగ్ రక్షాబంధన్ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కేఏ పాల్ ఆమరణ దీక్ష భగ్నం

- చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలింపు
- వైద్యుల నుంచి తప్పించుకుని ఆస్పత్రిలో పరుగు
- మహారాణిపేట సీఐతో దురుసు ప్రవర్తన



కేజీహెచ్ ఆవరణలో కేఏ పాల్

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి వైద్య పరీక్షలు చేయించారు. ఈ సమయంలో కేఏ పాల్ మహారాణిపేట సీఐ రమణమూర్తి కాలర్ పట్టుకొని... నీ పేరు చెప్పు అంటూ నిలదీశాడు. అనంతరం కేజీహెచ్ నుంచి కేఏ పాల్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్నారు. సాయంత్రం స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘ నాయకులు పాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం స్పందించే వరకు తన పోరాటం ఆగదని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేసే వరకు దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. దీక్ష విరమించుకోవాలని ఇప్పటికే పలువురు మంత్రులు ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగాలంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలన్నారు. దీక్ష ప్రారంభించి 24 గంటలు కాకముందే తనను బలవంతంగా తీసుకెళ్లారన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ అధ్యక్షుడు అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జీవనాడి స్టీల్‌ప్లాంట్‌ను అమ్మలాని కేంద్రం చూస్తోందన్నారు. కేఏ పాల్ దీక్షను భగ్నం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సీట్ల్‌ప్లాంట్ పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుంకట్టాలని కోరారు.

కేజీహెచ్‌లో పాల్ పరుగులు

కేజీహెచ్ ఆవరణలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మంగళవారం పరుగులు పెట్టారు. కేఏ పాల్ ఆమరణ నిరాహార దీక్షను మూడో పట్టణ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం భగ్నం చేసి చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ క్యాజువాలిటీలో పాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్న సమయంలో చికిత్స తీసుకోకుండా పాల్ పరుగు పెట్టారు. పాల్ వెనుక పోలీసులు, కేజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది కూడా పరుగెత్తారు. ఓపీ గేటు వద్ద ఆయన్ని పట్టుకొని తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేశారు. 30 నిమిషాల తర్వాత పాల్ వెళ్లిపోయారని వైద్యులు తెలిపారు.

రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి

- మహిళలపై వేధింపులు, మిస్సింగ్ కేసుల్లో తక్షణమే స్పందించాలి
- నేర సమీక్షలో సీపీ త్రివిక్రమ్ వర్మ



పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులతో నగర సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: నగరంలో రహదారి భద్రతపై దృష్టి సారించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ – 1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ – 2 కె.ఆనందరెడ్డి, డీసీపీ (క్రైం) జి.నాగన్న, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు ఏడీసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులతో నేర సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా ఇన్‌స్పెక్టర్ల పనితీరును సీపీ పరిశీలించారు. అనంతరం ఆయన నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను పరిశీలించి ఆయా రహదారుల వద్ద చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తీరు, విచారించి పరిష్కరిస్తున్న విధానాలపై ముఖ్య కార్యాచరణను సూచించి వెంటనే ఆచరణలో పెట్టాలని ఆదేశించారు.
- నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్న తీరు, ఫిర్యాదుదారులతో అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు.
- మాదక ద్రవ్యాల రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, వారిపై నిఘా వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- మహిళలపై వేధింపులు, మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి వారితో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.
- పోక్సో కేసులపై ఆరా తీశారు. నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు.
- వీఎంఎస్ (విజిటర్స్ మోనిటరింగ్ సిస్టమ్)ను పూర్తిగా లా అండ్ ఆర్డర్, క్రైమ్ సిబ్బంది వినియోగిస్తూ నిందితులను మరింత వేగంగా గుర్తించాలని ఆదేశించారు.
- ఎస్ఈబీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి నగరంలోని విద్యా సంస్థల వద్ద నిఘా పెట్టాలని, అలాగే ప్రముఖ ప్రాంతాల్లో డ్రగ్స్ కారణంగా కలిగే దుష్పరిణామాలపై బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
- సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. పలు కొత్త సాఫ్ట్‌వేర్లను వినియోగించాలని సూచించారు.
- కోర్టుల్లో కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా, నిందితులకు శిక్ష పడేలా చేసేందుకు, అధికారులు, సిబ్బంది సందేహాల నివృత్తికి పీడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జగదీష్ కుమార్, పోక్సో ప్రత్యేక పీపీ కె.కృష్ణ, ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కార కోర్టు స్పెషల్ పీపీ బి.వి.ఆర్.మూర్తి, 4వ ఏడీజే కోర్టు పీపీ బర్కత్ ఆలీఖాన్‌ను ఆహ్వానించారు. సీఎంఎస్ సిబ్బంది, అధికారులు పలు సందేహాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.
- లోక్ అదాలత్‌లో గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. క్రైమ్, ట్రాఫిక్ విభాగాల పనితీరుపై సమీక్షించారు.
- వచ్చే నెలలో నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో ప్రతి పోలీస్ స్టేషన్ గత నెల కంటే మెరుగ్గా, నేరాలు తగ్గుముఖం పట్టే విధంగా పోలీసింగ్ ఉండాలని స్పష్టం చేశారు.
- డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, అసంబద్ధ సంఘటనలు జరగకుండా నిలువరించిన నలుగురు అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేసి అభినందించారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక టూర్స్ ప్యాకేజీ

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాలు సందర్శించాలనుకునే భక్తులు, యాత్రికుల కోసం ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్ బిసా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సదరన్ డివైన్ టెంపుల్ టూర్ : సెప్టెంబరు 15న విశాఖపట్నంలో ప్రారంభమై 20న విశాఖలోనే ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురై మీనాక్షి అమ్మన్ గుడి, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోటి, కన్యాకుమారి, వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒకొక్కరికి రూ.45,900/- (సింగిల్ ఆక్యుపెన్సీ), రూ.35,875/- (డబుల్ ఆక్యుపెన్సీ), రూ.34,480/-(ట్రిబుల్ ఆక్యుపెన్సీ) అవుతుంది.

చార్‌ధామ్ యాత్ర : అక్టోబరు 16న విశాఖపట్నంలో ప్రారంభమై 27న విశాఖలో ముగుస్తుంది. ఈ టూర్‌లో హరిద్వార్, బార్‌కోట్, జంకిచట్టి, యమునోత్రి, ఉత్తర కాశీ, గంగోత్రి, గుప్త కాశీ, సోన్‌ప్రయాగ్, కేదార్‌నాథ్, బద్రినాథ్ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చు. ఒకొక్కరికి రూ. 86,320/-(సింగిల్ ఆక్యుపెన్సీ), రూ.58,820/-(డబుల్ ఆక్యుపెన్సీ), రూ.53,630/-(ట్రిబుల్ ఆక్యుపెన్సీ)కి వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా, లేదా 0891-2500695, 82879 32318, 92814 95847లో సంప్రదించాలని చంద్రమోహన్ కోరారు.

నేడు వేపగుంటలో మంత్రి రాజన్న దొర పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పి.రాజన్న దొర బుధవారం వేపగుంట సమీపంలో ఉన్న మీనాక్షి కన్వెన్సన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరవుతారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ నుంచి ఉదయం 10:30 గంటలకు బయలుదేరుతారు. కార్యక్రమం అనంతరం సాలూరు వెళ్లిపోతారు.

విదేశీ భాషా కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఫ్రెంచ్, జర్మన్, జపాన్ భాషల డిప్లొమా కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఫారిన్ లాంగ్వేజెస్ విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు ప్రవేశాలు కల్పిస్తామని, 11 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు వెంటనే ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కంటైనర్ టెర్మినల్ వద్ద ఉద్రిక్తత

- హామీల అమలుకు మత్స్యకారుల ఆందోళన



టెర్మినల్ ఎదుట ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



టెర్మినల్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు, సంఘాల నాయకులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో విశాఖ కంటైనర్ టెర్మినల్ (వీసీటీ) వద్ద మత్స్యకారులు ఆందోళనకు దిగారు. టెర్మినల్‌కు భూములు అప్పగించిన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం, సీఐటీయూ, ఇతర మత్స్యకార సంఘాల నాయకుల మద్దతుతో మంగళవారం ఉదయం నుంచి ఆందోళన చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఫలితంగా ద్వారం నుంచి కంటైనర్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ముందు జాగ్రత్త చర్యగా వన్‌టౌన్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. ఈ క్రమంలో మత్స్యకారులను పోలీసులు చెదరగొట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మత్స్యకారులు, టెర్మినల్ అధికారులతో చర్చలు జరిపారు. పది రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చర్చల్లో మహారాణిపేట తహసీల్దార్ ఆనందరావు పాల్గొన్నారు.

పోరాడుతున్నా పట్టించుకోలేదు

2002లో విశాఖ కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు సమయంలో టెర్మినల్‌లో 15 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, ఏడుగురికి మాత్రమే ఇచ్చారని, మిగిలిన 8 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.జయకుమార్, సీఐటీయూ నాయకుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. అదేవిధంగా సామాజిక భవనం నిర్మించడానికి, పేద మత్స్యకారులు 766 మందికి 60 గజాల చొప్పున స్థలం, లక్ష రూపాయల చొప్పున పరిహారం, ఇంటికో ఉద్యోగం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని... ఆ హామీల అమలుకు దశల వారీగా పోరాటాలు, ఆందోళనలు చేసినా టెర్మినల్ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని వాపోయారు. ఆందోళనకు మత్స్యకార సంఘాల నాయకులు చింతపల్లి అయ్యప్పరాజు, నొల్లు పోతురాజు, వాడమోదుల పెంటయ్య, వి.తాతాజీ, కర్రి చంద్రశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు.

సామాన్యులకు న్యాయ సేవలు

- న్యాయ సేవ ప్రాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎంవీ శేషమ్మ

విశాఖ లీగల్ : మారుతున్న చట్టాలకు అనుగుణంగా న్యాయవాదులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో న్యాయ సహాయకులు, ఉచిత న్యాయ సహాయం అందించే న్యాయవాదులకు ఒక రోజు శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శేషమ్మ మాట్లాడుతూ పేద మహిళలు, చిన్నారులు, వృద్ధులు, ఇతర వెనుకబడిన వర్గాల ప్రజలకు అందిస్తున్న న్యాయ సేవలను వివరించాలన్నారు. సమాజంలో సామాన్య పౌరులకు సైతం న్యాయ ఫలాలను అందించాలన్నారు. సేవా ప్రాధికార సంస్థ అందిస్తున్న సేవలను, అదాలత్ చట్టాలను వివరించారు. న్యాయ సేవా సంస్థ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏ వ్యక్తీ న్యాయ ఫలాలకు దూరం కాకూడదన్న జస్టిస్ కృష్ణ అయ్యర్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. న్యాయవాదులందరూ సమాజానికి నిజమైన సేవకులని కొనియాడారు. ఇటీవల న్యాయ సేవ సంస్థ, సమాంతర న్యాయవాదులు, శాశ్వత న్యాయవాదులు అందిస్తున్న సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

మూడో విడతలో 141 మందికి అక్రిడిటేషన్లు

మహారాణిపేట: జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న 141 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ప్రతిపాదనలు ఆమోదించామని కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో కమిటీ మూడో విడత సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న 636 మందికి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసినట్టు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు సెప్టెంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు రాఘవేంద్రరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, ఎం.చిట్టిబాబు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మోహన్‌లక్ష్మి, కమిటీ కన్వీనర్ వి.మణిరామ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

హెల్త్ స్కీమ్ దరఖాస్తులు అందజేయాలి

జిల్లాలో అక్రిడిటేషన్ గల జర్నలిస్టులందరూ వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణ కోసం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ దరఖాస్తులను వెంటనే అందజేయాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు. ఈ దరఖాస్తులకు సంబంధించి చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం సీఎస్సార్ నిధుల నుంచి ఉచితంగా చెల్లిస్తున్నామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

యువతి మృతికి కారణమైన ఇద్దరికి రిమాండ్

మర్రిపాలెం: ప్రేమ పేరుతో ఓ యువతిని ప్రలోభపెట్టి ఆమె మృతికి కారణమైన ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించినట్టు కంచరపాలెం పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలి ఇలా ఉన్నాయి... నర్సీపట్నానికి చెందిన యువతి నున్నం మాధురి (21) సెయింట్ జోసెఫ్ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతోంది. నర్సీపట్నంకు చెందిన అరుణ్ కుమార్‌తో ప్రేమలో పడింది. ఇదిలావుండగా అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్తగూడెంకు చెందిన సాయి గణేష్ కూడా మాధురి ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని పదేపదే వేధించేవాడు. అయితే గణేష్ ప్రేమను మాధురి నిరాకరించింది. కక్ష పెంచుకున్న గణేష్..మాధురి ప్రియుడు అరుణ్‌తో పరిచయం పెంచుకున్నాడు. యువతిపై లేనిపోని మాటలు చెప్పడంతో మాధురి..అరుణ్ మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో వేదన తట్టుకోలేక ఫిబ్రవరి 2న కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విచారణ చేపట్టిన కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి వాస్తవాలను తెలుసుకున్నారు. ఘటనకు కారణమైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం

- విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి
- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- వేడుకగా జాతీయ క్రీడా దినోత్సవం
- బెస్ట్ స్కూళ్లకు ఎక్సలెన్స్ అవార్డులు

విశాఖ విద్య: విద్యార్థులు చదువులతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ మినీ ఆడిటోరియంలో జిల్లా స్థాయి క్రీడోత్సవం వేడుకగా నిర్వహించారు. జేసీ విశ్వనాథన్ జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా స్థాయి క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి డీఈవో ఎల్.చంద్రకళతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో అనేక మంది ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారని, అలాంటి వారికి మరింత తర్ఫీదు ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచేలా ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. క్రీడల్లో సత్తా చాటుకునే వారికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఈ విషయాన్ని విద్యార్థులు తెలియజేయాలన్నారు.

పాఠశాలలకు స్పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులు అందజేత క్రీడా అంశాల్లో ప్రతిభ చూపిన జిల్లాలోని ఐదు పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థులకు జేసీ విశ్వనాథన్, డీఈవో చంద్రకళ అవార్డులను అందజేశారు. మొదటి స్థానం భీమునిపట్నం ది సన్ స్కూల్, రెండో స్థానం ఎండాడ జెడ్పీ హైస్కూల్, మూడో స్థానం జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌జీజీవోస్ కాలనీ సీతమ్మధార, నాల్గో స్థానం శ్రీకృష్ణాపురం గురుకులం, ఐదో స్థానం వాడపాలెం జెడ్పీ హైస్కూల్ దక్కించుకోగా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, వారికి మెమోంటో, స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ అదనపు జిల్లా కో–ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈవో వెంకటేశ్వర్లు, డీఎస్‌డీవో జూన్ గ్యాలియోట్, డెప్యూటీ డీఈవో గౌరీశంకర్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మొదటి స్థానం పొందిన భీమిలి ది సన్ స్కూల్‌కు అవార్డు అందజేస్తున్న జేసీ విశ్వనాథన్



రెండో స్థానంలో నిలిచిన ఎండాడ జెడ్పీ హైస్కూల్‌కు అవార్డు అందిస్తున్న జేసీ విశ్వనాథన్



మూడో స్థానంలో నిలిచిన ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌కు అవార్డు అందజేస్తూ..



అవార్డుతో శ్రీకృష్ణాపురం పాఠశాల నిర్వాహకులు



అవార్డు అందుకుంటున్న వాడపాలెం జెడ్పీ హైస్కూల్ నిర్వాహకులు

మితిమీరిన వేగంతో...

- అనకాపల్లి–ఆనందపురం హైవేలో రాంపురం వద్ద వ్యాన్‌ను ఢీకొన్న కారు
- ఒకరు మృతి, నలుగురికి తీవ్రగాయాలు
- యానాం నుంచి వస్తుండగా ఘటన



సంఘటనస్థలంలో కారులో ఇరుక్కుపోయిన సూర్యభగవాన్ మృతదేహం



ప్రమాదంలో నుజ్జయిన కారు, పరిశీలిస్తున్న పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: అనకాపల్లి–ఆనందపురం హైవేలో పెందుర్తి మండలం రాంపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యానాంకి చెందిన దొమ్మేటి సూర్య భగవాన్(27), రేవు పవన్‌కుమార్(27), గెడ్డం సురేష్(27), వేలంగి సాయికృష్ణ(28), రాజ్‌కుమార్(28) కారులో సోమవారం యానాం నుంచి విశాఖకు బయలుదేరారు. వీరిలో పవన్‌కుమార్ విశాఖలో ఎల్‌డీసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. పరీక్ష అనంతరం అందరూ కలిసి అరకు, విశాఖలోని పలు ప్రాంతాలు చూడాలని భావించారు. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో అనకాపల్లి నుంచి ఆనందపురం హైవేలో ప్రయాణిస్తున్న వీరి కారు పెందురి మండలంలోని రాంపురం సమీపంలో ముందు వెళ్తున్న వ్యాన్‌ని ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. కారు డ్రైవింగ్ చేస్తున్న దొమ్మేటి సూర్య భగవాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అసిరి తాత, ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. మృతుడు సూర్యభగవాన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకి పంపించారు. క్షతగాత్రుల వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా మంగళవారం ఉదయానికే చేరుకున్న క్షతగాత్రుల కుటుంబీకులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కాకినాడకు తీసుకెళ్లిపోయారు. వీరిలో సాయికృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కాగా పోస్టుమార్టం పూర్తికాగానే సూర్యభగవాన్ మృతదేహాన్ని కూడా వారి బంధువులకు అప్పగించారు. ఇదిలావుండగా ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ భయంతో పారిపోయాడు. కాగా కారులో బీర్ బాటిళ్లు లభ్యమవడంతో వీరంతా డ్రింక్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అలాగే ప్రమాదానికి మితిమీరిన వేగం కూడా కారణమై ఉండవచ్చని కూడా భావిస్తున్నారు. ప్రమాద సమయంలో వీరి కారు 140 కిలోమీటర్లు వేగంతో వెళ్తున్నట్టు పరిశీలనతో తేలింది. అలాగే ప్రమాదస్థలంలో వ్యాన్ ఆగి ఉన్నట్లు పలువురు చెబుతుండటంతో ఆ కోణంలో కూడా పరిశీలన చేస్తున్నారు. సీఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు అవార్డులు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ది ఒలింపిక్ సంఘం విశాఖ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు అవార్డులందించారు. తొలుత యూనివర్సిటీలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి నగర మేయర్ హరివెంకటకుమారి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్, సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అథ్లెటిక్స్‌లో జ్యోతి ఎర్రాజీ, వెయిట్‌లిఫ్టింగ్‌లో షేక్ లాల్ బహీర్, చెస్ బాక్సింగ్‌లో బి.వినీల, పవర్‌లిఫ్టింగ్‌లో ఎం.దుర్గాప్రసాద్‌లకు బెస్ట్ అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహకాల్ని అతిథులు అందించారు. బెస్ట్ పీఈటీగా పి.రాము, డిఎస్ఏ అథ్లెటిక్ కోచ్ కె.వైకుంఠం, స్పోర్ట్స్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావులకు అవార్డులు అందుకున్నారు.

శరవేగంగా బస్ బే పనులు



ఏర్పాటు చేస్తున్న బస్ బే బోర్డులు

సీతమ్మధార : విశాఖ సెంట్రల్ పార్కు ఎదురుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక నూతనంగా నిర్మించిన బస్ బే పనులు 70 శాతం పూర్తయ్యాయి. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా పనులు శరవేగంగా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

'ఓనం'దం

- ఇండియన్ మారీటైం యూనివర్సిటీలో ఘనంగా ఓనం వేడుకలు



ఓనం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధి సింధియా జంక్షన్ వద్ద గల ఇండియన్ మారీటైం యూనివర్సిటీలోని వాటర్‌వేస్‌లో మంగళవారం ఓనం వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూల్ ఆఫ్ మారీటైం మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ భానుప్రకాష్ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ మారీటైం లాజిస్టిక్స్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేశవ్‌దేవ్ మాట్లాడుతూ మారీటైం యూనివర్సిటీ విద్యార్థులు సమాజశ్రేయస్సు కోసం నిస్వార్థసేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ–నౌపడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం డివిజన్ పరిధి విశాఖ – నౌపడ–గుణుపూర్ సెక్షన్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఆయా స్టేషన్‌లలో సదుపాయాలు, స్టాక్‌లను పరిశీలించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న ప్లాట్‌ఫారాల ఎత్తు పెంచడం, విద్యుద్దీకరణ, పాదచారుల వంతెనలు వంటి పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. స్టాల్స్, రైల్వే కార్యాలయాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. పర్లాకిమిడి, గుణుపూర్ స్టేషన్‌లలో పలు సమస్యలను ఆర్‌యూసీసీ సభ్యుడు ఎస్‌పీ పండా డీఆర్ఎంకు వివరించారు. నౌపడ–గుణుపూర్ సెక్షన్‌లో ఆయా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, మీడియా, ప్రయాణికులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. వారి వినతులు, సూచనలు, సమస్యలు స్వీకరించారు. సాధ్యమైనంత త్వరంగా సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ పర్యటనలో వాల్తేర్ డివిజన్‌కు చెందిన సీనియర్ డివిజనల్ ఇంజినీర్(ఈస్ట్) ఎస్‌వీ రమణ, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జీ సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నౌపడ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

సచివాలయ ఉద్యోగులపై అదనపు భారం వద్దు

మహారాణిపేట: తమపై ఎలాంటి అదనపు భారం పెట్టవద్దని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు పీజే గణేష్ కుమార్‌కుమార్, భార్గవ్ కోరారు. మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. వార్డు అడ్మిన్ల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని కూలంకుశంగా పరిశీలించి, త్వరలో ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చినట్టు గణేష్ కుమార్ తెలిపారు. అన్ని పనులకు అడ్మిన్ సెక్రటరీలను బాధ్యులను చేయడం తగదన్నారు. మిగతా సెక్రటరీలకు నిర్దేశించిన పనులు అప్పగించి, అన్ని బాధ్యతలను అడ్మిన్ సెక్రటరీలకు అప్పగించడం అన్యాయమన్నారు. తాజాగా పీహెచ్ఎస్ మెషీన్ల భారం తమపై మోపుతున్నారన్నారు. వీటిని పునఃపరిశీలన చేయాలని గణేష్ కుమార్ కోరారు. మేయర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు భారత్, సుతేజ్ తదితరులు ఉన్నారు.



మేయర్ హరి వెంకట కుమారికి వినతి పత్రం అందజేస్తున్న గణేష్ కుమార్

చిన్న తరహా పరిశ్రమలతో ఉపాధి

కంచరపాలెం: చిన్న తరహా పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి అన్నారు. కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఏపీఐఐసీ బిల్డింగ్ ఐటీఐఎటీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు, సేవా పరమైన యూనిట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ప్రాజెక్ట్ విలువపై 35 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ఈ పథకం ఏదైన జాతీయ బ్యాంకు నుంచి రుణం పొంది యూనిట్స్/ప్రాజెక్ట్‌ను నూతనంగా ప్రారంభించడానికి అర్హులుగా పరిగణిస్తామని తెలిపారు. ప్రతి రూ.3లక్షల స్థిర పెట్టుబడులపై కనీసం ఒక వ్యక్తికి ఉపాధి కల్పిస్తామన్నారు. డెయిరీ ఫామ్, పౌల్ట్రీ, ఆక్వా కల్చర్, ట్రావెల్స్, పబ్లిక్, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు సుమారు రూ.20 లక్షలు వరకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎం శ్రీనివాసరావు, బాల సుబ్రహ్మణ్యం, పద్మ, మండలి సభ్యులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జీఎం గణపతి, ఇతర అధికారులు

పాఠశాలల్లో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్ఎం పైడిరాజు



క్వీన్ మేరీ స్కూల్లో సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు

విశాఖ విద్య: తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. అదే విధంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు జిల్లాలోని అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఇమంది పైడిరాజు మాట్లాడుతూ తెలుగు భాష అమ్మతో సమానమన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎం.రామకృష్ణ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ బి. రామచంద్రనాయుడులను ఈ సందర్భంగా సన్మానించారు. అదే విధంగా నగరంలోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రాచీన, ఆధునిక కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. పాఠశాల హెచ్ఎం జోగేంద్రనాథ్, ఉపాధ్యాయుడు ధర్మేంద్రరెడ్డి, అనిల్ జోషి, ఉషారాణి, సౌజన్య,నాగమణి, ఢిల్లీశ్వరి, సాయిరాజేశ్వరి పాల్గొన్నారు.

ఆధునికీకరణ నేపథ్యంలో పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మరికొన్ని రైళ్లు యథావిధిగా నడువనున్నాయన్నారు.

రద్దయిన రైళ్లు..

సెప్టెంబర్ 4 వరకు కాకినాడ–విశాఖ– కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్. రాజమండ్రి–విశాఖ–రాజమండ్రి (07466/07467) పాసింజర్. ఈ నెల 29, 30, సెప్టెంబర్ 1,2,3,4 తేదీల్లో విశాఖ–విజయవాడ– విశాఖ (22701 / 22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. వచ్చే నెల 4వ తేదీ వరకు గుంటూరు – విశాఖ (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, బుధవారం, వచ్చే నెల 5 వరకు విశాఖ–గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు మచిలీపట్నం–విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 4 వరకు విశాఖ–మచిలీపట్నం (17220)ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్ల దారి మళ్లింపు...

ధన్‌బాద్‌లో మంగళవారం, వచ్చేనెల 1,2,5,8,9 తేదీల్లో బయల్దేరే ధన్‌బాద్–అలెప్పీ(13351) బోకారో ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 8,15వ తేదీల్లో టాటానగర్‌లో బయల్దేరే టాటానగర్ – ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 2,9వ తేదీల్లో హతియాలో బయల్దేరే హతియా– ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, బుధవారం, సెప్టెంబరు 5వ తేదీన హతియాలో బయల్దేరే హతియా– ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్‌లు ఆయా తేదీలలో మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు

వచ్చేనెల 1, 3 తేదీల్లో తిరుపతిలో బయల్దేరే తిరుపతి–విశాఖ(22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ సామర్లకోట వరకు మాత్రమే నడుస్తుంది. సెప్టెంబరు 3,5 తేదీల్లో విశాఖ బయల్దేరవలసిన విశాఖ–తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం నుంచి కాకుండా సామర్లకోట నుంచి బయల్దేరుతుంది. ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు విజయవాడ–విశాఖ (12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ అనకాపల్లి వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు విశాఖలో బయల్దేరవలసిన విశాఖ–విజయవాడ(12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచి కాకుండా అనకాపల్లి నుంచి బయల్దేరుతుంది.